


సీఎం చంద్రబాబు విశాఖ రాక రేపు

- రాడిసన్ బ్లూ హోటల్‌లో జరగనున్నఇంటర్నేషనల్ మీడియేషన్ సదస్సుకు హాజరు



విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల ఐదో తేదీన విశాఖకు రానున్నారు. రాడిసన్ బ్లూ హోటల్‌లో జరగనున్న ఇంటర్నేషనల్ ... మిగతా 8వ పేజీలో

డిప్యూటీ సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

- మాడగడ గ్రామం, పవిత్ర గెడ్డను పరిశీలించిన ఎస్పీ అమిత్ బర్ధార్
- గ్రామాన్ని సందర్శించిన జాయింట్ కలెక్టర్



మాడగడ గ్రామంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ డాక్టర్ అభిషేక్‌గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్

అరకులోయ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాడగడలో నిర్వహిస్తున్న బలి ఉత్సవం ఆఖరి రోజు కార్యక్రమానికి ఈ నెల 5న హాజరవుతున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటన ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్ గౌడ, ఎస్పీ అమిత్ బర్ధార్ బుధవారం వేర్వేరుగా పరిశీలించారు. తొలుత ఎస్పీ అమిత్ బర్ధార్.. ఏఎస్పీ, డీఎస్పీ, స్థానిక సీఐ, ఎస్ఐలతో కలిసి మాడగడ గ్రామాన్ని, పవిత్ర గెడ్డను, పూజలు నిర్వహించే బలి దేవాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలతో ఎస్పీ అమిత్ బర్ధార్ మాట్లాడుతూ గిరిజనుల సంప్రదాయం, ఆచార, వ్యవహారాలను గౌరవించి ఇక్కడికి వస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు గిరిజన సంప్రదాయం ప్రకారం స్వాగతం పలకాలని కోరారు. బోసుబెడ్డ గ్రామ సమీపంలో గిరిజనులతో రచ్చబండ కార్యక్రమం మాదిరిగా సమావేశం ... మిగతా 8వ పేజీలో

స్నేహానికి ప్రతీక బలి ఉత్సవం

- మాడగడలో బ్రిటీష్ కాలం నుంచి కొనసాగుతున్న ఆచారం -8లో

పక్కాగా పర్యటన ఏర్పాట్లు

- అధికారులకు కలెక్టర్ ఆదేశం

పాడేరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అరకులోయ మండలంలో ఈ నెల 5న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పక్కాగా చేయాలని అధికారులను కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. డిప్యూటీ సీఎం పర్యటనపై కలెక్టరేట్‌లో బుధవారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిప్యూటీ సీఎం అరకులోయ మండలం కొత్తభల్లుగూడ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం, ఆ తరువాత గిరిజనులతో ముఖాముఖీ కార్యక్రమం, అనంతరం మాడగడలో బలి ఉత్సవంలో పాల్గొంటారన్నారు. అయా కార్యాక్రమాలకు సంబంధించి వివిధ శాఖల అధికారులకు అప్పగించిన ఏర్పాట్లను పక్కాగా చేయాలని, బందోబస్తు, వాహనాల



వివిధ శాఖల అధికారులతో సమావేశమైన కలెక్టర్ దినేశ్‌కుమార్

పార్కింగ్, రోప్ పార్టీ, తదితర భద్రతా చర్యలను చేపట్టాలని ఎస్పీ అమిత్‌బర్ధార్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ అమిత్‌బర్ధార్, జాయింట్ కలెక్టర్ ఎంజే అభిషేక్‌గౌడ, సబ్‌కలెక్టర్ శౌర్యమన్‌పటేల్, అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మన్యంలో జొల్ల పండుగ జోష్

- వరి నాట్లు పూర్తయిన తరువాత తొలి వ్యవసాయ పండుగ
- తరతరాలుగా కొనసాగుతున్న ఆచారం
- ఇలా చేస్తే పంట బాగుంటుందని గిరిజనుల విశ్వాసం

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

ఏజెన్సీలో గిరిజన రైతులు పలు ప్రాంతాల్లో జొల్ల పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. దీంతో గిరి పల్లెల్లో, పంట పొలాల్లో జొల్ల పండుగ సందడి నెలకొంది. మైదాన ప్రాంతాలకు భిన్నంగా, ఇతరులకు ఆసక్తి కలిగేలా గిరిజనుల ఆచార, వ్యవహారాలు ఉంటాయి. వాటిపై గిరిజనులు తరతరాలుగా విశ్వాసం ఉంచి, పాటిస్తూనే ఉంటారు. అటువంటి వ్యవహారాల్లో ఒకటిగా జొల్ల పండుగకు ప్రత్యేకత ఉంది.

ఏజెన్సీలో గిరిజనులు వరి నాట్లు పూర్తయిన మూడు వారాలకు విధిగా జొల్ల పండుగను నిర్వహిస్తారు. ప్రతి గిరిజన రైతు ఈ పండుగను బుధవారం మాత్రమే నిర్వహించాలనే నిబంధన తరతరాలుగా కొనసాగుతున్నది. వరిసాగు చేసే ప్రతి రైతు నాట్లు పూర్తయిన మూడు వారాల తరువాత వచ్చే బుధవారం నాడు కచ్చితంగా జొల్ల పండుగను ఆచరిస్తారు.

'జొల్ల పండుగ' ఇలా...

గిరిజన రైతులు వరి నాట్లు పూర్తయిన మూడు వారాల తరువాత అడవికి వెళ్లి కస్మి, సీడి, పెద్ద జొల్ల మొక్కల కొమ్మలను తీసుకువస్తారు. ఇంటి వద్ద లేదా గ్రామ సావిడి వద్ద కోడిని కోసి, దాని రక్తాన్ని బియ్యంలో కలిపి అక్షింతలు చేస్తారు. అలాగే అన్నంలో సైతం పసుపు, కోడి రక్తం కలుపుతారు. వాటితో అడవుల నుంచి తీసుకువచ్చిన కొమ్మలను పట్టుకుని ఇంటిల్లిపాది తమ పంట పొలాలకు వెళతారు. అక్కడ దేవతలకు మొక్కిన తరువాత అడవుల నుంచి తీసుకువచ్చిన మొక్కల



పొలంలో జొల్ల మొక్కలు నాటేందుకు వెళుతున్న గిరిజన రైతు

కొమ్మలను పంట పొలాల్లో పాతుతారు. అలాగే పూజ చేసి తీసుకువచ్చిన అక్షింతలు, అన్నం మెతుకులను సైతం పంట పొలాల్లో చల్లుతారు. ఇలా చేయడం వల్ల పంట బాగుంటుందని, లేకుంటే పంట పాడవుతుందని గిరి రైతుల విశ్వాసం.

గిరిజన సంప్రదాయంలో శాస్త్రీయ విధానం

వరి నాట్లు పూర్తయిన మూడు వారాల తరువాత సంప్రదాయంగా గిరిజనులు నిర్వహించే జొల్ల పండుగ వెనుక శాస్త్రీయత దాగి ఉందని పలువురు పూర్వీకులు అంటున్నారు. ఈ సంప్రదాయ పండుగలో భాగంగా రైతులు పొలాల్లో పాతే కొమ్మలు ఔషధ మొక్కలకు చెందినవని గిరి రైతులు అంటున్నారు. ఔషధ గుణాలు కలిగిన కస్మి, సీడి, పెద్ద జొల్ల మొక్కల కొమ్మలను పంట పొలాల్లో పాతడం వల్ల, లేత వరి పైరును ఆశించాలనుకునే పలు రకాల పురుగులను ఈ కొమ్మలు ఆకర్షించి వరి పంటను కాపాడుతాయని పలువురు అంటున్నారు. అయితే సస్యరక్షణలో భాగంగా చేపట్టాల్సిన ఈ చర్యను సంప్రదాయం, ఆచారాల్లో కలిపి చేయడం వల్ల గిరిజనులు పండుగగా భావించి, విధిగా దానిని పాటిస్తారనే ఆలోచనతో పూర్వీకులు జొల్ల పండుగగా నామకరణం చేసి ఆచరిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. దానినే అడవి బిడ్డలు తరతరాలుగా కొనసాగిస్తున్నారు.



జి.మాడుగుల మండలం సింగర్బ పంచాయతీ బూరుగువీధిలోని పంట పొలాల్లో జొల్ల మొక్క నాటుతున్న గిరిజనుడు

జి.మాడుగులలో..

జి.మాడుగుల: మండలంలో జొల్ల పండుగ సందడి నెలకొంది. పలు గ్రామాల్లో బుధవారం ఈ పండుగను జరుపుకున్నారు. భీరం పంచాయతీ వి.కోడాపల్లి, సింగర్బ ఎంచాయతీ బూరుగువీధి తదితర గ్రామాల్లో ఆ పండుగను నిర్వహించారు.

పాడేరు ఘాట్‌లో స్తంభించిన ట్రాఫిక్

- ఓ మలుపు వద్ద రెండు లారీలు ఆగిపోవడమే కారణం
- కలెక్టర్ దినేశ్‌కుమార్‌కూ తప్పని ఇబ్బందులు



పాడేరు ఘాట్‌లో ఏసుప్రభు బొమ్మ మలుపు వద్ద రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయిన లారీలు

పాడేరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఘాట్ మార్గంలో బుధవారం ఉదయం ఏసుప్రభు బొమ్మ మలుపులో ఎదురెదురుగా రెండు లారీలుగా ఆగిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో సుమారుగా మూడు గంటల పాటు ఘాట్‌లో ట్రాఫిక్ స్తంభించిపోయింది. మైదాన ప్రాంతం నుంచి సిమెంట్ లోడుతో ఏజెన్సీకి వస్తున్న ఓ భారీ లారీ ఘాట్‌లో ఏసుప్రభు బొమ్మ మలుపు వద్ద ఆగిపోయింది. అలాగే పాడేరు వైపు నుంచి ఇనుప పైపులతో మైదాన ప్రాంతానికి వెళుతున్న మరో భారీ లారీ ఆ మలుపులో తిరగలేక రోడ్డుకు అడ్డంగా ఆగిపోయింది. దీంతో రెండు భారీ లారీలు మలుపునకు అడ్డంగా ఉండిపోవడంతో వాహనాల రాకపోకలకు వీలులేని పరిస్థితి ఏర్పడింది. దీంతో బుధవారం ఉదయం పది గంటల నుంచి సుమారుగా మూడు గంటల పాటు ఏజెన్సీకి, మైదాన ప్రాంతానికి రాకపోకలు నిలిచిపోయాయి. తరచూ ఘాట్‌లో ఇటువంటి పరిస్థితులు ... మిగతా 8వ పేజీలో



ఘాట్‌లో ఎక్కడికక్కడ ఆగిపోయిన వాహనాలు



తిరుమణి శ్రీపూజ

పాడేరు ఐటీడీఏ పీవోగా శ్రీపూజ నియామకం

- ఎట్టకేలకు ఎనిమిది నెలల తరువాత పీవో పోస్టు భర్తీ
- రంపచోడవరం ఐటీడీఏ పీవోగా బి.సమరన్‌రాజ్

పాడేరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీడీఏ పీవోగా 2022 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన తిరుమణి శ్రీపూజను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ ఐటీడీఏ పీవోగా పని చేస్తున్న వి.అభిషేక్‌ను ఈ ఏడాది జనవరిలో పోలవరం ప్రాజెక్టు పరిపాలనాధికారిగా బదిలీ చేయడంతో అప్పటి నుంచి ఐటీడీఏ పీవో పోస్టు ఖాళీగానే ఉంది. దీంతో స్థానిక జాయింట్ కలెక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడకు ఐటీడీఏ పీవోగా ఇన్‌చార్జి ... మిగతా 8వ పేజీలో

చింతపల్లిలో కాఫీ బెర్రీ బోరర్ తెగులు

- హెచ్ఆర్‌యూలో ప్రాథమిక పరీక్షల్లో గుర్తించిన కేంద్ర కాఫీ బోర్డు అధికారులు
- నియంత్రణ చర్యలు ప్రారంభించిన ఉద్యాన శాస్త్రవేత్తలు





ఉద్యాన పరిశోధన స్థానం తోటల్లో కాఫీ బెర్రీ బోరర్ వ్యాప్తి చెందిన మొక్కలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు సునీల్‌బాబు, బిందు, జేఎల్‌వో రవికుమార్. (ఇన్‌సెట్లో) బెర్రీ బోరర్ తెగులు సోకిన కాఫీ కాయలు

చింతపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉద్యాన పరిశోధన స్థానం కాఫీ తోటల్లో కాఫీ బెర్రీ బోరర్ తెగులు వ్యాప్తి చెందినట్టు కేంద్ర కాఫీ బోర్డు శాస్త్రవేత్తలు గుర్తించారు. అరకులోయలో కాఫీ బెర్రీ బోరర్ తెగులు బయటపడడంతో గిరిజన ప్రాంతంలో కేంద్ర కాఫీ బోర్డు అధికారులు సర్వే చేస్తున్నారు. బుధవారం స్థానిక ఉద్యాన పరిశోధన స్థానంలో కాఫీ తోటలను ఆర్‌వీనగర్ కేంద్ర కాఫీ పరిశోధన స్థానం శాస్త్రవేత్త, అధిపతి డి.సునీల్‌బాబు, జూనియర్ లైజనింగ్ అధికారి జె.రవికుమార్, స్థానిక అధిపతి, శాస్త్రవేత్త చెట్టి బిందు పరిశీలించారు. ఉద్యాన పరిశోధన స్థానంలో సాగు చేస్తున్న అరబిక, రొబస్టా కాఫీ తోటల్లో ప్రాథమిక దశలో కాఫీ బెర్రీ బోరర్ తెగులు వ్యాప్తి చెందినట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇప్పటి వరకు కేవలం అరకులోయ చిన్నలబుడు పంచాయతీ పరిధిలోనే ఈ తెగులు ఉన్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. చింతపల్లి ఉద్యాన పరిశోధన స్థానంలో ఈ తెగులు బయటపడడం రైతులను కలవరపెడుతున్నది.

ఈ సందర్భంగా ఆర్‌వీనగర్ కేంద్ర కాఫీ పరిశోధన స్థానం శాస్త్రవేత్త సునీల్‌బాబు విలేకరులతో మాట్లాడుతూ చింతపల్లి మండల కేంద్రం మ్యాక్స్, ఐటీడీఏ నిర్వహణలో ఉన్న ఎకో పల్పింగ్ యూనిట్‌కి ... మిగతా 8వ పేజీలో

రాష్ట్ర స్థాయి ఉత్తమ టీచర్లుగా ముగ్గురు ఎంపిక

- రోజారాణి, రాంబాబు, సత్యారావుకు దక్కిన గౌరవం



మత్స్యపురం స్కూల్ టీచర్ ఎం.సత్యారావు

పాడేరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవం పురస్కారాల్లో భాగంగా రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికలో జిల్లాకు చెందిన ముగ్గురు టీచర్లకు అవకాశం దక్కింది. జిల్లాలో అరకులోయ మండలం కంఠబౌన్సగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు టీచర్‌గా పని చేస్తున్న శెట్టి రోజారాణి, అనంతగిరి మండలం చిలకలగెడ్డ గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాలలో సోషల్ టీచర్‌గా పని చేస్తున్న శెట్టి ... మిగతా 8వ పేజీలో

జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

- అధికారులకు కలెక్టర్ ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, పక్కన సమగ్ర శిక్ష ఏపీసీ స్వామినాయుడు, డీఈవో బ్రహ్మాజీరావు

పాడేరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని అధికారులను కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జిల్లా అభివృద్ధిలో భాగంగా చేపడుతున్న కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌కు మండల విద్యాశాఖాధికారులు సంపూర్ణంగా హాజరుకాకపోవడంతో పాటు వారి పనితీరు బాగాలేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఎంఈవోలు క్షేత్ర పర్యటనలు చేసి పాఠశాలల్లో విద్యార్థుల చేరిక ప్రక్రియను 15 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థుల ఆధార్ నమోదు, తల్లికి వందనం పెండింగ్ పనులు త్వరలోనే పూర్తి చేయాలన్నారు. ఇంటర్ విద్యలో పరిస్థితులపై ఆరా తీసి, కాలేజీల్లో ఉన్న అధ్యాపకులు, ఇతర అంశాలను తనకు నివేదించాలన్నారు. విద్యాలయాల్లో కనీస సదుపాయాలు కల్పించాలని, విద్యాభివృద్ధిని ఆశించిన స్థాయిలో సాధించాలని సూచించారు. విద్యార్థులకు బేస్‌లైన్ టెస్టులు ... మిగతా 8వ పేజీలో



డోలీలో గర్భిణిని ఆస్పత్రికి తీసుకువెళుతున్న దృశ్యం

5 కిలోమీటర్లు డోలీ మోత

- గర్భిణికి తప్పని అవస్థలు

అనంతగిరి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల లంగుపర్తి పంచాయతీ నేలపాలెం గ్రామానికి రహదారి సౌకర్యం లేక నిండు గర్భిణికి ఇబ్బందులు తప్పలేదు. ఆమెను ఐదు కిలోమీటర్ల మేర డోలీలో తరలించాల్సిన దుస్థితి నెలకొంది. మండలంలోని మారుమూల లంగుపర్తి పంచాయతీ నేలపాలెం గ్రామానికి చెందిన సిరగం చిన్నమ్మి నిండు గర్భిణి. బుధవారం ఆమెకు పురిటినొప్పులు ... మిగతా 8వ పేజీలో

అద్దరవీధి కల్వర్టు వద్ద కాంక్రీట్ పనులు ప్రారంభం

» 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్


కల్వర్టు వద్ద మెటల్‌వేసి చదును చేస్తున్న గిరిజనులు

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం అద్దరవీధి కల్వర్టు వద్ద కాంక్రీట్ పనులను ప్రారంభించారు. అద్దరవీధి కల్వర్టు వద్ద తూరాలు ఏర్పాటుచేసి మట్టితో పూడ్చివేయడం వల్ల బురదమయమైంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలకు ప్రయాణికులు అవస్థలుపడుతున్నారు. వాహనాలు బురదలో కూరుకుపోతున్నాయి. ఈ సమస్యలను వివరిస్తూ సెప్టెంబరు ఒకటోతేదీన 'అద్దరవీధి బురదలో కూరుకుపోయిన వ్యాన్' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. ఎస్‌ఎంఐ ఇంజనీరింగ్ అధికారులు స్పందించారు. కల్వర్టు వద్ద కాంక్రీట్ పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌ని ఆదేశించారు. ఈమేరకు కాంట్రాక్టర్ పనులు చేపట్టేందుకు బుధవారం మెటల్ పంపించారు. కొత్తపాలెం, మండపల్లి గ్రామానికి చెందిన 30మంది గిరిజనులు శ్రమదానం చేసి బురదమయమైపోయిన కల్వర్టు వద్ద మెటల్ వేసి రహదారి చదును చేశారు. శ్రమదానం చేసిన గిరిజనులకు కోఆప్టెడ్ సభ్యుడు ఎస్కే దావీదు భోజనాలు ఏర్పాటు చేశారు. రెండు రోజుల్లో కాంక్రీట్ పనులు పూర్తి చేస్తామని ఎస్‌ఎంఐ ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

దసరా ఉత్సవ కమిటీ ఏర్పాటు


ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా వెంకటరమణ


ప్రధాన కార్యదర్శిగా శ్రీను

పాడేరురూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాడేరు మెయిన్ బజారులో దుర్గాదేవి దసరా ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు దసరా ఉత్సవాల కమిటీని బుధవారం ఏర్పాటు చేసినట్టు కమిటీ గౌరవాధ్యక్షుడు వెయ్యాకుల సత్యనారాయణ తెలిపారు. ఈ నెల 29వ తేదీ సోమవారం నుంచి అక్టోబరు 4వ తేదీ శనివారం వరకు దసరా ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షులుగా వెయ్యాకుల సత్యనారాయణ, శిరాత్రి నాగేశ్వరరావు, పచ్చా మాణిక్యాలరావు, పూసర్ల గోపి, బీక్కవోలు నూకరాజును అధ్యక్షుడిగా ఏరువాక వెంకటరమణ (సిండికేట్ రమణ), ఉపాధ్యక్షులుగా గంగపూజారి శివకుమార్, బిమల పూజారి ఈశ్వరరావు, కూడి వలసంనాయుడును, ప్రధాన కార్యదర్శులుగా యాదగిరి శ్రీను, బోనంగి రమణ, ఆనుబోతుల గణేశ్, కార్యదర్శులుగా కూడి రామునాయుడు, కూడి చిట్టిబాబు, శివరాత్రి సూర్యప్రకాశ్, ఇమిడిశెట్టి మోహన్‌కుమార్, కోశాధికారిగా బూరెడ్డి రామునాయుడు, పచ్చా రవీంద్ర, సహాయ కార్యదర్శులుగా పూసర్ల మధు, ద్రాక్షారపు కోటి, శ్రీనాధు నానాజీ, కసిరెడ్డి ప్రతాప్, శ్రీమంతుల చిట్టిబాబు, కొణతాల ప్రశాంత్, ఆర్గనైజర్లుగా పాపాని వెంకట్, నీలకంఠానగర్, గుడివాడ యాత్ సభ్యులను ఎన్నుకున్నారు.

నెలాఖరు వరకు ఈ- క్రాప్ నమోదు

కొయ్యూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే ఉద్యాన, ఇతర వ్యవసాయ పంటల వివరాలను ఈ నెలాఖరులోగా సమీప రైతు సేవా కేంద్రాలలో ఈ- క్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి ప్రియాంక సూచించారు. ఈ నమోదుతో ప్రభుత్వం తరపునవచ్చే పథకాలు, అన్నదాత సుఖీభవ, ధాన్యం కొనుగోలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్టపరిహారం, రాయితీలు వర్తిస్తాయన్నారు.

కబడ్డీలో సెమీ ఫైనల్స్‌కు ఏపీ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ జట్టు


తలపడుతున్న ఆంధ్రప్రదేశ్, యూపీ క్రీడాకారులు

సీలేరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): 47వ జాతీయ సాయి కబడ్డీ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ జట్టు సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నట్టు ఏపీ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ జట్టు మేనేజర్ సీహెచ్ సురేశ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం యాదాద్రిగుట్టలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో బుధవారం ఆంధ్రప్రదేశ్ జట్టు, ఉత్తరప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ జట్లు తలపడ్డాయి. ఆంధ్రప్రదేశ్ జట్టు (35 పా యింట్ల తేడాతో) గెలుపొంది సెమీ ఫైనల్స్‌కు చేరుకుంది. జట్టు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న సీలేరుకు చెందిన కె. శ్రీనివాసులు, సీలేరుకు చెందిన మరో క్రీడాకారుడు కె. శ్రీని వాస్ బెస్ట్ డిఫెన్సర్‌గా తమ ప్రతిభను కనబరచడంతో ఆంధ్రప్రదేశ్ జట్టు సెమీస్‌కు చేరినట్టు జట్టు మేనేజర్ సీహె సురేశ్ చెప్పారు.

అన్నసమారాధన

సీలేరు, సెప్టెంబరు 3 , (ఆంధ్రజ్యోతి) : సీలేరులో బుధవారం స్థానిక శివాలయం వీధిలో ఏర్పాటు చేసిన వినాయకుని సన్నిధిలో భారీ అన్న సమారాధనను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. అలాగే అల్లూరివీధిలో వినాక మండపం వద్ద బుధవారం సాయంత్రం సామూహిక కుంకుమ పూజలను నిర్వహించారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టు రద్దు చేసే వరకు పోరాటం

» బస్కీలో సర్వే రాళ్లను ధ్వంసం చేసిన గిరిజనులు


బస్కీలో నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజన సంఘం నేతలు, సర్పంచ్

అరకులోయ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హైడ్రో పవర్‌ప్రాజెక్టు అనుమతులను రద్దు చేసేంతవరకు నిరసన కార్యక్రమాలు ఆపేది లేదని ఆదివాసీ గిరిజన సంఘం నేతలు బాలదేవ్, అరకులోయ వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, బస్కీ సర్పంచ్ పాడి రమేశ్ స్పష్టంచేశారు. బుధవారం బస్కీ పరిసర ప్రాంతాల్లో హైడ్రోపవర్ ప్రాజెక్టుకు సంబంధించిన సర్వే దిమ్మలను గిరిజనుల సంప్రదాయ పనిముట్లతో ధ్వంసం చేసి నిరసన వ్యక్తంచేశారు. ఇటీవల లోతేరు పరిధి దూద్ కొండి, బూర్జ పంచాయతీ మజ్జివలస, భస్కీ పరిసర ప్రాంతాల్లో హైడ్రో పవర్‌ప్రాజెక్టులకు సంబంధించిన సర్వే దిమ్మలు పాతారు. ఈ నేపథ్యంలో బస్కీ ఎంపీటీసీ సభ్యుడు, వైస్ ఎంపీపీ ఆదివాసీ గిరిజన


గ్రామ పరిసరాల్లో సర్వే రాళ్లను ధ్వంసం చేస్తున్న గిరిజనులు

సంఘం, పంచాయతీ పరిధిలోని గిరిజనం నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం హైడ్రోపవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఇచ్చిన 51వ జీవోను తక్షణం రద్దు చేయాలన్నారు. నవయుగ, ఆదానీ కంపెనీలకు హైడ్రో పవర్ ప్రాజెక్టులు కట్టబెట్టి గిరిజనుల బతుకులను ఛిద్రం చేసేందుకు చర్యలు తీసుకోవడం తగదన్నారు. ఎటువంటి సమాచారం ఇవ్వకుండా బడా పారిశ్రామికవేత్తలకు తమ బతుకులను వీధి పాలు చేసే అధికారం ఎవరిచ్చారని ధ్వజమెత్తారు. ఈ ప్రాజెక్టులవల్ల గిరిజనులు సాగుచేసుకునే వ్యవసాయం, కాఫీతోటలు, పంటపొలాలు నీటి పాలవతాయన్నారు. ఇంతగా నష్టం వాటిల్లే ప్రాజెక్టుల విషయంలో చూస్తూఊరుకునేది లేదని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనల సంరక్షణ చట్టాలు,హక్కులను కాలరాస్తే ప్రతిఘటిస్తామన్నారు. ఇకనైనా స్పందించి ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ ప్రతినిధులతో పాటు గిరిజన సంఘం నేతలు రామారావు తదితరులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సీఐకు సన్మానం


బదిలీపై వెళుతున్న సీఐకు వీడ్కోలు పలుకుతున్న సిబ్బంది

కొయ్యూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కొయ్యూరు సీఐగా రెండున్నరేళ్లలో పనిచేసిన వెంకటరమణ గంజాయి రవాణా నిరోధం, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేసినట్టు పలువురు వక్తలు కొనియాడారు. బదిలీపై వెళుతున్న సీఐ వెంకటరమణ వీడ్కోలు సభను బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొయ్యూరు, మంప ఎస్‌ఐలు కిశోర్‌వర్మ, శంకరరావు ఆయనను సత్కరించి జ్ఞాపికను అందచేశారు. అనంతరం పలువురు నాయకులు, ప్రజలు, వ్యాపారులు, పాత్రికేయులు తదితరులు సీఐను సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. టీడీపీ నేత ఎంపీపీ ప్రసాద్, జడ్పీటీసీ సభ్యుడు వారానూకరాజు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన బాలామృతం సరఫరా


అన్నవరంలో పంపిణీ చేసిన కాలం చెల్లిన ప్యాకెట్ చూపుతున్న మహిళ

సీలేరు, సెప్టెంబరు 3 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ పరిధిలోని అన్నవరం మినీ అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లలకు కాలం చెల్లిన బాలామృతం ప్యాకెట్లను పంపిణీ చేసినట్టు గుమ్మిరేవుల మాజీ సర్పంచ్ పూజారి బాబూరావు ఆరోపించారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, పంచాయతీ పరిధిలోని మాదిమళ్ల అంగన్‌వాడీ సెంటర్ నుంచి అన్నవరంఅంగన్‌వాడీ సెంటర్‌కు బాలామృతం పౌష్టికాహార ప్యాకెట్లను సరఫరా చేశారన్నారు. తీరా అవి చూస్తే కాలం చెల్లినవని, ఇలాంటి సరకులు పిల్లలకు పెడితే వారికి వికటించి ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉందనిఆయన ఆందోళన వ్యక్తంచేశారు. ఐసీడీఎస్ అధికారులు తక్షణమే స్పందించి దీనిపై విచారణ జరిపించి వాటి స్థానంలో కొత్త బాలామృతం సరకులు సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

శ్రమదానంతో రహదారికి మరమ్మతులు


రహదారి మరమ్మతులు చేపడుతున్న పాడి గ్రామస్థులు

కొయ్యూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాడి గ్రామస్థులు శ్రమదానంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఛిద్రమైన రహదారితోపాటు వంతెనకు తాత్కాలిక మరమ్మతులు చేసి రాకపోకలు పునరుద్ధరించారు. వివరాలివి.. రత్నంపేట నుంచి పాడి మీదుగా కన్నంపేట వెళ్లే ప్రధాన రహదారి అల్పపీడన ప్రభావంతో గత వారంలో కురిసిన వర్షాలకు పూర్తిగా కోతకు గురైంది. పాడి గ్రామ సమీప కొండవాగుపై వంతెన పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే సుమారు ఆరు గ్రామాలతో పాటు పాడి గ్రామస్థులు సమస్య నెదుర్కొంటున్నారు. దీంతో స్పందించిన పాడి గ్రామస్థులు శ్రమదానంతో కొట్టుకుపోయిన వంతెనపై కాంక్రీట్‌తో సరిచేయటంతో పాటు మట్టితో రాకపోకలకు అంతరాయం లేకుండా మరమ్మతు పనులు చేపట్టారు. ఈ రోడ్డులో గోతులు, కోతకు గురైన ప్రదేశాల్లో మరమ్మతులు చేపట్టి రవాణాకు అంతరాయం లేకుండా చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ ప్రధానంగా గ్రామం ముందు కొండవాగుపై వంతెన నిర్మాణాలను సత్వరం పూర్తి చేసేలా అధికారులు, పాలకులు చర్యలు తీసుకోవాలన్నారు. మరోసారి విస్తృతంగా వర్షాలు కురిస్తే ఉన్న కొద్దిపాటి వంతెన తెగిపోయి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయే పరిస్థితులు నెలకొంటాయని ఆందోళన వ్యక్తంచేశారు.

విద్యార్థుల మృతిపై విచారణ చేపట్టాలి: ఎస్‌ఎఫ్‌ఐ

పాడేరురూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల మృతిపై ప్రభుత్వం వెంటనే సమగ్ర విచారణ చేపట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి పాంగి జీవనకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం ఇప్పటికే ఆరుగురు విద్యార్థినీ, విద్యార్థులు ఆశ్రమాల్లో మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతగిరి మండలంలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థిని కె.అవంతిక ఆదివారం మృతి చెందిన ఘటనపై విచారణ చేపట్టి వారి కుటుంబానికి రూ. 35 లక్షలు నష్ట పరిహారం ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. గత విద్యా సంవత్సరంలో జిల్లాలో 48 మంది విద్యార్థులు మృతి చెందారని, ఈ ఏడాది ఇప్పటికే ఆ రుగురు మృతి చెందారన్నారు. అయినా, ప్రభుత్వం స్పందించక పోవడం విచారకరమన్నారు. ప్రభు త్వం తక్షణమే స్పందించి గిరిజన సంక్షేమ ఆశ్రమాల్లో హెల్త్ వలంటీర్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో జీసీసీ ఉద్యోగి గోవిందరావు మృతి


గోవిందరావు (ఫైల్‌ఫొటో)

చింతపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన సహకార సంస్థ కొయ్యూరు బ్రాంచి పరిధిలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ సంపరి గోవిందరావు అనారోగ్యంతో మృతి చెందారు. జూనియర్ అసిస్టెంట్ గోవిందరావు ప్రస్తుతం కాకరపాడు పెట్రోల్ బంక్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నాడు. ఆయన కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడున్నారు. ఆయన కుటుంబంతో చింతపల్లి మండల కేంద్రం ఆయన నివాసంలో ఉంటున్నాడు. మంగళవారం రాత్రి ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించి తుది శ్వాస విడిచాడు. ఆయనకు భార్య ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న చింతపల్లి డివిజనల్ మేనేజర్ బుక్కా వెంకటేశ్, కొయ్యూరు బ్రాంచి మేనేజర్ సరమండ విజయ కుమార్ కుటుంబాన్ని పరామర్శించారు. తక్షణ సాయంగా రూ.25వేల నగదును అందజేశారు. ఆయన అంత్య క్రియల్లో జీసీసీ కొయ్యూరు బ్రాంచి అకౌంటెంట్ గసాడి మల్లేశ్వరరావు, చింతపల్లి బ్రాంచి మేనేజర్ చల్లంగి సుగునాథం, గ్యాస్ ఇన్‌చార్జి ఎల్. రమణమూర్తి, ఎంఎల్‌ఎస్ ఇన్‌చార్జి ఎంవీ రమణమూర్తి, జీసీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి: సీఐటీయూ



పాడేరులో ర్యాలీ చేపట్టిన ఆటో కార్మికులు

పాడేరురూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి లింగేటి సుందరరావు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పాడేరు ఆటో కార్మికులు బుధవారం పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి అంబేడ్కర్ కూడలి వరకు భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణ పథకం అమలు చేయడంతో కార్మికులు జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడ్డారన్నారు. ఈ స్థితిలో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది ఆటో కార్మికులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నారు. పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలతో ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. దీనికితోడు వాహనదారులపై జరిమానాలను విపరీతంగా పెంచారన్నారు. ప్రైవేటు ఫైనాన్స్ వడ్డీలు కట్టుకోలేక కొంత మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆటో కార్మికులకు ఏడాదికి వాహన మిత్ర కింద రూ. 25 వేలు భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆటో కొనుగోలుకు బ్యాంక్ రుణాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ ఆటో కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు కృష్ణారావు, అధ్యక్షుడు జె.సంజీవరావు, కార్యదర్శి ప్రసాద్, సుందరరావు, వెంకటరావు, బాలు, సురేష్, కిరణ్, అనిల్, సాయి, దాసు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పరిరక్షణకు చర్యలు

» మండల సమావేశంలో ఎంపీపీ రమేశ్‌బాబు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రమేశ్‌బాబు

కొయ్యూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుధ్య పనులకు ప్రాధాన్యమివ్వాలని పంచాయతీ కార్యదర్శులు, వైద్యశాఖ సిబ్బందికి స్థానిక ఎంపీపీ బడుగు రమేశ్‌బాబు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వీడీకే ప్రసాద్ ఆధ్వర్యంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత సమావేశంలో స భ్యులు సమావేశం దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలు వాటి పరిష్కారానికి చేపట్టిన చర్యలను ముందుగా అధికారులు వివరించారు. అనంతరం అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తీరును ఎంపీడీవో సమావేశంలో వెల్లడించారు. ఎంపీపీ మాట్లాడుతూ అ ల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు జరిగిన నష్టాలను పంచాయతీల వారీగా అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉండడంలేదని వస్తున్న ఫిర్యాదులపై ఏవో ప్రియాంకను ఆయన ప్రశ్నించారు. ఏవో మాట్లాడుతూ, ఎరువులు రైతులకు అందరికీ అందుబాటులో ఉండేలా చూస్తానని, సిబ్బంది కొరతతో సమస్య నెలకొందని వివరణ ఇచ్చారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా చూడాలని ఈ సందర్భంగా ఎంపీపీ అధికారులకు సూచించారు. అనంతరం అధికారులు శాఖల వారీ ప్రగతిని సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, ఎంపీటీసీలు, 33 పంచాయతీల సర్పంచ్‌లు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కోటబంధలో రక్షిత పథకం ప్రారంభం


కుళాయిలను ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ శారద, సర్పంచ్

చింతపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపాలెం పంచాయతీ కోటబంద గ్రామంలో రూ.3.5 లక్షలతో నిర్మించిన తాగు నీటి పథకం నిర్మిచ వైస్ ఎంపీపీ గోపీనాయక్ శారద, సర్పంచ్ వనగల సోమరత్నం బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో గిరిజనులు మంచి నీటి కోసం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొనేవారన్నారు. ఈమేరకు 15వ ఆర్థిక సంఘం నిధులతో రక్షిత మంచి నీటి పథకం నిర్మించినట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో వైసీపీ మండల కార్యదర్శి బెన్నిబాబు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

రోగులకు సకాలంలో వైద్య సేవలు

» జిల్లా కేంద్ర ఆస్పత్రి సహాయ కలెక్టర్ సాహిత్ తనిఖీ


జిల్లా ఆస్పత్రిలో సిబ్బందితో మాట్లాడుతున్న సహాయ కలెక్టర్ సాహిత్

పాడేరురూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఆస్పత్రిలో సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలందించాలని సహాయ కలెక్టర్ సాహిత్ సూచించారు. బుధవారం ఆయన స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా సందర్శించారు. రోగుల విభాగం, అత్యవసర కేసుల వార్డు, మెడికల్, సర్జికల్, గైనిక్ వార్డులను పరిశీలించారు. వార్డుల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం కల్పించాలన్నారు. రోగులకు మందులను అందించారు. ప్రయోగశాల, ఎక్స్‌రే, స్కాన్ సెంటర్లు పనితీరు పరిశీలించారు. ఆస్పత్రిలో ప్రసవాల రికార్డులను పరిశీలించారు. రిఫరల్ సర్వీస్, అంబులెన్స్ సేవలపై అడిగితెలుసుకున్నారు. రోగుల పట్ల ప్రేమానురాగాలను చూపుతూ వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో వి.విశ్వేశ్వరనాయుడు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ హేమలతాదేవి, గైనకాలజిస్టు నరసింగరావు, వివిధ విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

చట్రాపల్లి, తోకరాయిల్లో పక్కా ఇళ్లకు స్థల పరిశీలన


తోకరాయిలో స్థల పరిశీలన చేస్తున్న తహసీల్దార్, ఇతర అధికారులు

సీలేరు, సెప్టెంబరు 3 , (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చట్రాపల్లి, తోకరాయి గ్రామాల్లో గిరిజనులకు పక్కా ఇళ్ల నిర్మాణానికి అవసరమైన స్థలాలను జీకేవీధి తహసీల్దార్ అన్నాజీరావు బుధవారం పరిశీలించారు. గత ఏడాది సెప్టెంబర్ 8వతేదీన ఈ రెండు గ్రామాల్లో భారీ విపత్తు సంభవించి కొండలపైనుంచి బండరాళ్లతో వరద నీరు గ్రామాల్లోకి వచ్చి ఇళ్లు సైతం కొట్టుకుపోయి భారీ నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల్లో గిరిజనులకు సురక్షితమైన ప్రాంతంలో ఇళ్లు నిర్మిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ మేరకు జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశాల మేరకు ఇళ్ల నిర్మాణానికి తహసీల్దార్ అన్నాజీరావు హౌసింగ్ ఏఈ సూర్య, ఇరిగేషన్ ఏఈ నాగమణిలతో కలసి రెండు గ్రామాల్లో పర్యటించారు. అనుకూలమైన స్థలాలను పరిశీలించారు. చట్రాపల్లిలో 37, తోకరాయిలో 92 కుటుంబాలకు వ్యవసాయానికి దగ్గరగా ఉండేలా అటవీ, రెవెన్యూ భూములను పరిశీలించి, ఈ నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపించనున్నామని ఈ సందర్భంగా తహసీల్దార్ తెలిపారు.

గోమంగి మండలం ఏర్పాటుతో మేలు


అరకు ఎంపీకి వినతిపత్రం అందిస్తున్న ప్రతినిధులు

పాడేరురూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పెదబయలు మండలంలోని మారుమూల గోమంగి పంచాయతీ కేంద్రాన్ని ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేయాలని కోరుతూ గోమంగి ప్రత్యేక మండల సాధన కమిటీ ప్రతినిధులు బుధవారం పాడేరులో అరకు ఎంపీ డాక్టర్.గుమ్మా తనూజారాణి, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ఎస్పీ అమిత్ బర్దార్‌లను కలిసి వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా మండల సాధన సమితి ప్రతినిధి సల్లంగి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, గత మూడు దశాబ్దాలుగా గోమంగిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని పోరాడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల సాధన సమితి నాయకులు గంపరాయి ధనుంజయ్, జంపరంగి తిరుపతిరావు కూడా బొంజుబాబు, జర్సింగి సూర్యనారాయణ, కొమ్మా అనంత పద్మనాభం, కూడా రాధాకృష్ణ, కొర్రా సత్తిబాబు, కూడా సుబ్రహ్మణ్యం, గంపరాయి రవి వర్మ, కుంబిడి విక్టర్, పొయిభ సతీశ్, బత్తిరి నరేశ్, యువరాజ్, పాల్గొన్నారు.

అల్పాహారం ఇలాగేనా..?

కొత్తూరు కేజీబీవీలో మెనూపై సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి అసంతృప్తి


విద్యార్థినులతో కలసి అల్పాహారం తింటున్న అధికారి స్వామినాయుడు

అనంతగిరి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు కేజీబీవీ విద్యాలయాన్ని జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ స్వామినాయుడు బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల అల్పాహారం పరిశీలించి తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. పాఠశాల ప్రత్యేక అధికారిణి (ఎస్.వో)తో ఈ ఆహారాన్ని తినిపించారు. ఆమెతో కుక్‌లను షోకాజ్ నోటీసులు అందించారు. మెనూ సక్రమంగా అమలు చేయాలని సూచించారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులతో ముచ్చటించి, ఇప్పటి నుంచే పబ్లిక్ పరీక్షలకు సంసిద్ధులు కావాలని సూచించారు. విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. తరగతుల వారీగా సామర్థ్యాలను, ఎఫ్-1 అసెస్‌మెంట్ బుక్స్‌ను పరిశీలించారు. అదనపు తరగతి గదుల నిర్మాణం నిమిత్తం సమగ్ర శిక్ష డీఈ, సైట్ ఇంజనీర్‌లతో చర్చించారు. పాఠశాలను అభివృద్ధిలోకి తీసుకువెళ్లాలని ఎస్‌వో సుశీలకు, సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ బి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పాడేరు ఆర్టీసీ డిపో మేనేజర్‌గా శ్రీనివాసరావు


డీఎంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న డిపో సిబ్బంది, డ్రైవర్, కండక్టర్లు

పాడేరురూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పాడేరు ఆర్టీసీ డిపో మేనేజర్‌గా పి.శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలను స్వీకరించారు. విశాఖపట్నం స్టీల్ సిటీ డిపోలో ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఇంత వరకు ఇక్కడ డీఎంగా విధులు నిర్వహిస్తున్న టి.ఉమామహేశ్వరరెడ్డి మద్దిలపాలెం డిపో మేనేజర్‌గా బదిలీపై వెళ్లారు. బుధవారం శ్రీనివాసరావు.. ఉమామహేశ్వరరెడ్డి నుంచి బాధ్యతలను స్వీకరించారు. ఆయనకు శ్రీనివాసరావును డిపో సిబ్బంది, డ్రైవర్, కండక్టర్లు, డిపో యూనియన్ నాయకులు డి.శ్రీనివాస్, బి.ప్రసాద్, కేఎస్‌ఎన్.రాజు తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక


లోతుగెడ్డలో ర్యాలీ చేపడుతున్న దృశ్యం

చింతపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్ర జ్యోతి): ఆది కర్మయోగి కార్యక్రమంలో భాగంగా డీపీజుగా గ్రామాల అభివృద్ధికి ఐదేళ్ల వార్షిక ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్టు ఎంపీడీవో సీహెచ్ సీతామహాలక్ష్మి అన్నారు. బుధవారం డీపీ జుగలో ఎంపికైన లోతుగెడ్డ, బం దబయలులో ఏపీఎం శ్రీనివాసరావు, అ న్నవరం కాలనీలో ఏఈఈ బాలకిశోర్, బయలుకించంగిలో తహసీల్దార్ ఆనందరావు సర్వేచేపట్టారు.సర్పంచ్ సునీల్ ఉన్నారు.

రాజ్‌మా విత్తనాలు పంపిణీ

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులు సకాలంలో రాజ్‌మా నాట్లు వేసుకోవాలని ఏవో డి. గిరిబాబు అన్నారు. బుధవారం రింతాడ రైతు సేవా కేంద్రంలో రైతులకు రాజ్‌మా విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ సరబన్నదొర, జనసేన మండలాధ్యక్షుడు కొయ్యం బాలరాజు, మండల మహిళా మోర్చా నాయకులు శోభరాణి, వైస్ ప్రెసిడెంట్ ఎం. సోమేశ్ కుమార్, అగ్రికల్చర్ అసిస్టెంట్ వసుపరి సౌందర్య పాల్గొన్నారు.

చింతపల్లి: రైతులకు ప్రభుత్వం 90శాతం రాయితీపై రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేస్తున్నట్టు బలపం సర్పంచ్ రమేశ్ నాయుడు అన్నారు. బుధవారం రైతులకు రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు బాబూరావు, లింగారావు, రంగారావు, అచ్చిబాబు, వీరయ్యదొర, చిట్టిబాబు పాల్గొన్నారు.

గంజాయి రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

▸▸ ఈగల్ బృందం ఇన్‌స్పెక్టర్ నాగార్జున



సర్వీసు వాహనాల డ్రైవర్లతో మాట్లాడుతున్న ఈగల్ ఇన్‌స్పెక్టర్ నాగార్జున

చింతపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు సర్వీసు వాహనాల డ్రైవర్లు, యజమానులు గంజాయి రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఈగల్ బృందం ఇన్‌స్పెక్టర్ డి. నాగార్జున హెచ్చరించారు. బుధవారం స్థానిక వారపు సంతలో ప్రైవేటు సర్వీసు ఆటోలు, జీపులు, మినీ వ్యాన్‌ల డ్రైవర్లు, యజమానులతో ఈగల్ బృందం పోలీసులు సమావేశమయ్యారు. డ్రగ్స్, గంజాయి వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను ప్రధాన కూడలిలో అతికించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు గంజాయి రవాణాకు సహకరిస్తే నగదు అధిక మొత్తంలో నగదు ఇస్తామని డ్రైవర్లను ప్రలోభ పెడతున్నారన్నారు. వారికి సహకరిస్తే కేసుల్లో ఇరుక్కోవాల్సివస్తుందన్నారు. గంజాయి కేసుల్లో జైలు పాలైతే జీవనాధారం కోల్పోతారన్నారు. అపరిచితులు వాహనాల్లో ప్రయాణిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంపరి రమణ పాల్గొన్నారు.

డుంబ్రిగుడ ఎంఈవో- 2గా గెన్ను


జాయినింగ్ ధ్రువ పత్రాన్ని అందజేస్తున్న ఎంఈఓ గెన్ను

డుంబ్రిగుడ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖాధి- 2గా జి. గెన్ను నియమితులయ్యారు. బుధవారం ఆయన ఎంపీడీవో ప్రేమ్ సాగర్, ఎంఈఓ సుందరరావులకు జాయినింగ్ పత్రాన్ని అందజేసి బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అధికారులు, ఉపాధ్యాయుల సహకారంతో మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఎంఈఓ-2 జాన్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు అప్పలరాజు, ఉపాధ్యాయులు ఎం శ్రీను, చిన్నిబాబు, రమేశ్, రాంప్రసాద్, లక్ష్మయ్య, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాంకింగ్ సేవలపై గ్రామాల్లో విస్తృత ప్రచారం


ముంచంగిపుట్టులో భవనం పరిశీలిస్తున్న పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో పోస్టల్ బ్యాంకింగ్ సేవలపై విస్తృత ప్రచారం చేపట్టాలని సిబ్బందికి అనకాపల్లి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు సూచించారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో సబ్ పోస్టాఫీసు ఏర్పాటుకు కేటాయించిన ఆర్‌అండ్‌బీ భవనాన్ని ఆయన పరిశీలించారు. భవన మరమ్మతులపై అరకు ఐపీవో లక్ష్మీకిశోర్‌తో చర్చించారు. అనంతరం ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల బీపీఎంలు, ఏబీపీఎంలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి పోస్టల్ శాఖలో ఉన్న పొదుపు ఖాతాలపై వివరిస్తూ అవగాహన కల్పించాలన్నారు. ఎస్‌బీ, ఆర్‌డీ, సుకన్య, ఆర్‌పీఎల్‌ఐ, పీఎల్‌ఐ, బీమా, ఐపీపీబీ తదితర ఖాతాలు తెరిస్తే పొందే లబ్ధిని ప్రజలకు వివరించాలని కోరారు.

గంజాయి, సారాకు దూరంగా ఉంటేనే భవిష్యత్తు


మాట్లాడుతున్న సర్పంచ్ త్రినాథ్

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గంజాయికి, సారాకి దూరంగా ఉంటే భవిష్యత్తు బాగుంటుందని లక్ష్మీపురం పంచాయతీ సర్పంచ్ కె.త్రినాథ్ అన్నారు. గ్రామంలో బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయిని సాగు చేసినా, సారా తయారు చేసినా, వాటిని విక్రయించినా శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు. కొంత మంది యువకులు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారులతో చేతులు కలుపుతూ జైలుపాలై జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వి.సాధురాం, మహిళా పోలీస్ సుమలత, పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో భారీ వర్షం


ముంచంగిపుట్టులో బుధవారం రాత్రి కురుస్తున్న వర్షం

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మూడు రోజులుగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ కాసెత్తిస్తోంది. సాయంత్రం 3 గంటల తరువాత ఈదురు గాలులతో భారీ వర్షం కురుస్తోంది. బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఏకధాటిగా వర్షంపడింది. మండల కేంద్రంతో పాటు జోలాపుట్టు, సంగడ, పెదబయలు, కుమడ, లక్ష్మీపురం తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారుల్లో పలు చోట్ల వర్షపు నీరు ప్రవహించింది. వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. జోలాపుట్టు, డుడుమ జలాశయాలలోకి వరదనీరు ఇన్‌ఫ్లో ఎక్కువగా ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన


టొంగికోటలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వనభసింగి పంచాయతీ టొంగికోట గ్రామంలో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. రోడ్డులేక తలెత్తిన ఇబ్బందులపై గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో స్పందించిన ఆమె రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి రూ. 5లక్షలు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వి.లక్ష్మణ్, కూటమి, వైసీపీ నేతలు పాల్గొన్నారు.

నేడు స్టాండింగ్ కమిటీ సమావేశం

విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం మేయర్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం జరగనున్నట్టు జీవీఎంసీ కార్యదర్శి బీవీరమణ తెలిపారు. ఇందుకోసం 198 అంశాలతో అజెండా తయారుచేసి సభ్యులకు అందజేశామన్నారు. నీటిసరఫరా పైప్‌లైన్‌ల మరమ్మతులు, కొత్తవాల్వ్‌ల ఏర్పాటు, ఫెర్రిక్‌ఆలం, నీటిశుద్ధి రసాయనాల కొనుగోలు, ట్యాంకర్లను అద్దెప్రాతిపదికన తీసుకోవడం వంటి 50 అంశాలను పొందుపరిచారు. కొన్ని జోన్‌ల పరిధిలోని చెత్త ట్రాన్స్‌ఫర్‌స్టేషన్ల వద్ద తడి-పొడి చెత్త విభజనకు ర్యాగ్‌పిక్కలను నెలవారీ అద్దెప్రాతిపదికన ఏడాది కాలానికి విధుల్లోకి తీసుకోవడం, తాత్కాలిక పారిశుధ్య కార్మికులకు వేతనాల చెల్లింపు, డ్రెయిన్‌లు, కల్వర్టులు, భవనాలు, రోడ్ల నిర్మాణాలు, గెడ్డల్లో పూడిక తీతకు యంత్రాలను సమకూర్చడం, బీచ్‌రోడ్డులో పారిశుధ్య నిర్వహణకు నియమించిన తాత్కాలిక కార్మికులకు వేతనాల చెల్లింపు, పారిశుధ్య కార్మికులకు యాప్రాన్‌లు కొనుగోలు, జీవీఎంసీ వాణిజ్య సముదాయాల్లోని దుకాణాల వేలం, నిరాశ్రయుల కోసం జీవీఎంసీ నిర్వహిస్తున్న ఆశ్రయ కేంద్రాల నిర్వహణను ఎన్‌జీవోలకు అప్పగించడం వంటి అంశాలను అజెండాలో చేర్చారు.

గుంతల మయం.. ప్రయాణాలు భయం..

▸▸ పరవాడలోని జంక్షన్లలో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి

▸▸ రాకపోకలకు హడలిపోతున్న వాహనదారులు

▸▸ పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు


పెట్రోల్‌బంక్ కూడలిలో దెబ్బతిన్న రహదారి


ఊటగెడ్డ కూడలి వద్ద రహదారి పై ఏర్పడిన గొయ్యి


పరవాడ సినిమాహాల్ కూడలిలో రహదారిపై...

పరవాడ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడలోని పలు జంక్షన్లలో రహదారులు అధ్వానంగా మారాయి. ఎక్కడికక్కడ గోతులు పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సినిమాహాల్ కూడలి, పెట్రోల్ బంక్ కూడలి, మండల పరిషత్ కూడలి, ఊటగెడ్డ కూడలిలలో మరీ దారుణంగా ఉన్నాయి. ఈ జంక్షన్‌ల మీదుగా గాజువాక, సింధియా, విశాఖపట్నం, అచ్యుతాపురం, ఫార్మాసిటీ, సింహాద్రి ఎన్టీపీసీ తదితర ప్రాంతాలకు విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, సాధారణ ప్రయాణికులతో పాటు పరిశ్రమలకు యంత్ర సామగ్రిని తరలించే భారీ వాహనాలు నిత్యం అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. కూడళ్ల వద్ద ఏర్పడిన గుంతల కారణంగా పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రాత్రి సమయాల్లో ఈ కూడళ్లపై నుంచి ప్రయాణించాలంటేనే హడలిపోతున్నారు. గుంతల కారణంగా రహదారి ధ్వంసం కావడంతో పలువురు ద్విచక్ర వాహనదారులు చిన్నచిన్న ప్రమాదాలకు గురవుతున్నారు. ఐదు నెలల క్రితమే ఈ కూడళ్లలో రహదారికి మరమ్మతులు చేపట్టారు. ఇంతలోనే భారీ గుంతలు ఏర్పడడంతో ఆర్‌అండ్‌బీ శాఖ అధికారుల తీరుపై అంతా మండిపడుతున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం వల్లనే మూన్నాళ్లకే పరిస్థితి యథాతథంగా మారిందని వాపోతున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి కూడళ్ల వద్ద ఏర్పడిన గుంతలను పూడ్చివేసి, పూర్తి స్థాయిలో మరమ్మతు పనులు చేపట్టాలని అంతా కోరుతున్నారు.

యువతకు నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ

▸▸ సీఐపీఈటీతో సింహాద్రి ఎన్టీపీసీ ఒప్పందం


ఒప్పంద పత్రాలు చూపిస్తున్న ఈడీ సమీర్‌శర్మ, సీఐపీఈటీ జేడీ శేఖర్

పరవాడ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ సామాజిక బాధ్యతలో భాగంగా పరవాడ ప్రాంతంలో గల నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇప్పించేందుకు సింహాద్రి యాజమాన్యం విజయవాడకు చెందిన సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజినీరింగ్ టెక్నాలజీ (సీఐపీఈటీ)తో బుధవారం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో నాలుగు నెలల వ్యవధిలో ఒక్కొక్క బ్యాచ్‌కు 30 మంది అభ్యర్థులతో మూడు బ్యాచ్‌లకు మెషిన్ ఆపరేటర్, ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్‌పై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఇందుకు సంబంధించిన ఒప్పంద పత్రాలపై సింహాద్రి ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్‌శర్మ, సీఐపీఈటీ జాయింట్ డైరెక్టర్ సీహెచ్.శేఖర్ సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన అధికారులతో పాటు సీఎస్ఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కవచం శక్తి యాప్

▸▸ డీఎస్పీ శ్రీనివాసులు



సదస్సులో మాట్లాడుతున్న మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసులు

కొత్తూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : శక్తి యాప్ మహిళలకు రక్షణ కవచం వంటిదని అనకాపల్లి మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. ఇక్కడి ఏఎంఏఎల్ కళాశాలలో శక్తి యాప్, వారియర్స్‌పై బుధవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. శక్తి యాప్ ప్రతి ఒక్కరి వద్ద ఉంటే దాని ద్వారా లైవ్ లొకేషన్ తెలుస్తుందన్నారు. తద్వారా మహిళలపై జరిగే అకృత్యాలను అరికట్టవచ్చునని వివరించారు. ఎస్ఐ రాములమ్మ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తులో జోగేవారికి మంచి, చెడులు తెలియని స్థితిలో చాలా అకృత్యాలకు పాల్పడుతున్నారని వాపోయారు. అటువంటి వారిపట్ల ఆడ పిల్లలు జాగ్రత్త వహించాలన్నారు. ప్రధానంగా విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు, సూపరింటిండెంట్ పి.అనురాధ, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ జె.సామ్రాజ్యం, జీఎంఎస్ కార్యదర్శి స్వరూప తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో సంస్కరణలతో రాష్ట్రానికి అరుదైన గౌరవం : బుద్ద



తుమ్మపాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ విద్యారంగంలో సంస్కరణలను చేపట్టడం ద్వారా రాష్ట్రానికి అరుదైన గౌరవం దక్కిందని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆస్ట్రేలియాలో నిర్వహించే కార్యక్రమానికి మంత్రి లోకేశ్‌కు ఆహ్వానం రావడం ఆనందదాయకమన్నారు. అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుదేనని పేర్కొన్నారు.

'ల్యాండ్ పూలింగ్ పేరుతో మోసం'

తుమ్మపాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ల్యాండ్ పూలింగ్ పేరుతో ప్రభుత్వాలు అమాయకుల వద్ద నుంచి భూములను లాక్కొని మోసానికి ఒడిగడుతున్నాయని ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జీసస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పీఎస్ అజయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వం డి.పట్టా ఉన్న వారి నుంచి భూములను లాక్కొని తిరిగి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చి నెరవేర్చ లేదన్నారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఈ కుంభకోణంపై పెద్ద ఎత్తున ప్రచారం చేసి అధికారంలోకి వచ్చాక ముఖం చాటేయడం దారుణమని వాపోయారు. అనకాపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో దాదాపు 1940 ఎకరాల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని, ల్యాండ్ పూలింగ్‌లో భూములు ఇచ్చిన వారికి న్యాయం చేయాలని ఆయన కోరారు.

వివాహిత అదృశ్యంపై కేసు

కశింకోట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. బుచ్చెయ్యపేట మండలం రాజాం గ్రామానికి చెందిన మహిళ గత నెల 11న కశింకోట మండలం నర్సింగబిల్లి వద్ద ఉన్న గ్రామీణ వికాస్ బ్యాంక్‌కు వచ్చిందన్నారు. ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆమె తండ్రి బుధవారం ఫిర్యాదు చేయడంతో ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

ఇన్‌చార్జి తహశీల్దార్‌గా శాంతిభూషణరావు

అనకాపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి ఇన్‌చార్జి తహశీల్దార్‌గా శాంతిభూషణరావును నియమిస్తూ బుధవారం కలెక్టర్ విజయకృష్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ఎంటీ అప్పారావు అనారోగ్యం కారణంగా సెలవుపై వెళ్లారు. పరిపాలనా సౌలభ్యం కోసం డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న శాంతిభూషణరావుకు ఇన్ చార్జి బాధ్యతలు అప్పగిస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు.

నేత్రపర్వంగా వినాయక నవరాత్రి వేడుకలు

▸▸ నిదానందొడ్డిలో ఆకట్టుకున్న దీపారాధన



వినాయకుడు, లింగాకారం ఆకారాల్లో వెలిగించిన దీపాలు


అమృతపురంలో స్వామిని దర్శించుకుంటున్న వెంకటేశ్వరరావు, తదితరులు

కొత్తూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వినాయక నవరాత్రి ఉత్సవాలు పలు ప్రాంతాల్లో నేత్రపర్వంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా వీధి వీధినా ప్రతిష్ఠించిన, ఆలయాల్లో కొలువుదీరిన స్వామివారికి విశేష పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అనకాపల్లి పట్టణం గవరపాలెం నిదానందొడ్డిలో గణేశ్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద బుధవారం రాత్రి దీపాలంకరణను చేపట్టారు. స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారు, ఓంకారం, శివలింగం, వినాయకుని ఆకారాల్లో దీపాలను పేర్చి వెలిగించారు.

సబ్బవరం : మండలంలోని అసకపల్లి, అమృతపురం, సబ్బవరం అంబేడ్కర్ కాలనీ, గోపాల్‌నగర్ తదితర ప్రాంతాల్లో వినాయక నవరాత్రి ఉత్సవాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సోదరుడు వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వైసీపీ నేతలు గండి రవికుమార్, బోకం రామునాయుడు, కర్రి బాబు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధనను ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు శింగంపల్లి శ్రీను, దొడ్డి ప్రకాశ్, కర్రి కనకరాజు, నర్సింగరావు, అప్పారావు, కేవీ సత్యనారాయణ, దెడ్డం ప్రసాద్, యడ్ల నాయుడు, డి.శ్రీను, గవరరాజు, రెడ్డి రామునాయుడు, శేఖర్, జెట్టి ప్రసాద్, వాసు, రవి, బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సరుగుడు పెంపకానికి రైతులు మొగ్గు

▸▸ వరి, చెరకు పంటలకు ప్రత్యమ్నాయంగా ఐదు వేల ఎకరాల పైబడి సాగు


లగిశెట్టిపాలెంలో సాగులో ఉన్న సరుగుడు

సబ్బవరం, సెప్టెంబరు 3 : సరుగు సాగుపై ఈ ప్రాంత రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఫలితంగా ఈ ఏడాది సాగు విస్తీర్ణం మరింత పెరిగింది. గతంలో మెట్ట ప్రాంతాలకే పరిమితమైన సరుగుడు సాగు, ఇప్పుడు పల్లపు ప్రాంతాల్లో, చెరువుల కింద కూడా అధికంగా చేపడుతున్నారు. వ్యవసాయ పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోవడం, కూలీల కొరత, వాతావరణ పరిస్థితులు అనుకూలించక పోవడంతో పాటు చీడపీడల బెడద, వర్షాలు సకాలంలో కురవక పోవడంతో తదితర కారణాల దృష్ట్యా వరి, చెరకు పంటలకు ప్రత్నామ్నాయంగా సరుగుడు సాగుపై మొగ్గుచూపుతున్నారు.

మండల రైతాంగానికి వరి ప్రధాన పంట. ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల వల్ల నారు మడులు ఎండిపోవడం, మళ్లీ నారు పోసుకోవడం, యంత్రాలతో దమ్ము చేసి నాట్లు వేసిన తరువాత చీడపీడల బెడద, కలుపు బెడద, కలుపు తీసేందుకు కూలీలు దొరక్కపోవడంతో పాటు ఖర్చులు అధికమయ్యాయి. అలాగే, ఒకప్పుడు సబ్బవరం మండలంలో చెరకు సాగుకు ప్రసిద్ధి. క్రమేపీ ఈ పంట వలన లాభం లేకపోవడం, ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కరువవ్వడంతో చెరకు సాగును పూర్తిగా తగ్గించేశారు. సుమారు రెండు దశాబ్దాల క్రితం వరకు గొటివాడ, ఆరిపాకలలో కాటాలు ఉండేవి. ఇప్పుడు అవి రెండూ మూతపడ్డాయి అంటేనే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పెదయాతపాలెం, నల్లరేగులపాలెం గ్రామాల్లోనే అక్కడక్కడ చెరకు వేస్తున్నారు. పెట్టుబడులు పెట్టనా ఆ స్థాయిలో లాభాలు రావడం లేదు. దీంతో రైతులు ప్రత్యామ్నాయ పంటలైన సరుగుడు, నీలగిరి పెంపకంపై దృష్టిసారిస్తున్నారు.

అంతకాపల్లి, అయ్యన్నపాలెం, ఆరిపాక, టెక్కలిపాలెం, వంగలి, బంగారమ్మపాలెం, మలునాయుడుపాలెం, అసకపల్లి, బాటజంగాలపాలెం, నారపాడు తదితర గ్రామాల్లో అధిక మొత్తంలో రైతులు సరుగుడు సాగువైపు మొగ్గు చూపుతున్నారు. అయ్యన్నపాలెం భూదేవి చెరువు, ఆరిపాక వెంకట్రావు చెరువు, ఆదిరెడ్డిపాలెం పోతురాజు చెరువు, అమృతపురం రాజ్ చెరువు, అసకపల్లి సంగడాల చెరువుల కింద సైతం సరుగుడు సాగును చేపడతున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో సుమారు ఐదు వేల ఎకరాల్లో సరుగుడు, సుమారు ఐదు వందల ఎకరాల్లో నీలగిరి సాగులో ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు.

ఒకేసారి పెద్ద మొత్తంలో ఆదాయం

సరుగుడు సాగుకయ్యే ఖర్చు తక్కువగా ఉండడంతో రైతులు ఈ దిశగా మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తుంది. గత కొన్నేళ్లుగా సరుగుడ ధర కూడా ఆశాజనకంగా ఉండడం రైతాంగం ఈ సాగువైపు ఆసక్తి చూపుతున్నారు. ఒకసారి ఉడిస్తే నాలుగైదేళ్ల ఎటువంటి పెట్టుబడి లేకుండా ఒకేసారి పెద్ద మొత్తంలో డబ్బులు వస్తుండడంతో రైతులు ఈ పంట సాగుకే ఇష్టపడుతున్నారని అంటున్నారు. ఎకరా విస్తీర్ణంలో సరుగుడు సాగు చేస్తే నాట్లు వేసిన దగ్గర నుంచి కలుపు తియ్యడం, ఎండలు విపరీతంగా ఉంటే నీటి తడులు పెట్టడం చేస్తుంటారు. మొదటి ఏడాది గరిష్ఠంగా రూ.30 నుంచి రూ.35 వేలు ఖర్చు అవుతుంది. నాలుగు నుంచి ఐదేళ్ల మధ్య చెట్లు కోతకు వస్తాయి. ఎకరాకు ఐదేళ్లకు 40 నుంచి 50 టన్నులు దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. ఏడాది క్రితం వరకూ టన్ను సరుగుడు ధర రూ.8,500 నుంచి రూ. తొమ్మిది వేలు వరకూ ఉండేది. ఇప్పుడు టన్ను రూ. ఏడు వేలు లెక్కన వస్తుంది. ఈ లెక్కన ఎకరా సరుగుడుకి కనిష్ఠంగా రూ.60 వేలు నుంచి రూ. 65 వేలు వస్తుందని రైతులు చెబుతున్నారు. ఒకేసారి పెద్ద మొత్తంలో ఆదాయం కనిస్తుండడంతో రైతులు సరుగుడు సాగువైపు మొగ్గు చూపిస్తున్నారు.


సబ్బవరం శివారు ఆదిరెడ్డిపాలెం పోతురాజు చెరువు కింద...


ఆరిపాక రెవెన్యూ పరిధి వెంకట్రాజు చెరువు కింద...

14 ఎకరాల్లో సరుగుడు సాగు చేస్తున్నాను



ఏడాది క్రితం వరకూ నాలుగు ఎకరాల్లో కౌలుకు వరి సాగు చేసే వాడిని. ఎకరాకు రూ. 20 నుంచి రూ.25 వేల వరకు ఆదాయం వచ్చేది. చీడపీడలు, వర్షాభావ పరిస్థితులు కన్నా కూలీలు ఇబ్బంది అధికంగా ఉండేది. మా అన్నదములతో కలిసి కరోనా సమయం 2021లో పది ఎకరాల్లో కౌలుకు సరుగుడు వేశాను. ఈ ఏడాది జనవరిలో కోసి విక్రయించగా ఆశించిన మేరకు ఫలితం దక్కింది. అందుకే ఈ ఏడాది వరి మానేసి మొత్తంగా 14 ఎకరాల్లో కౌలుకు సరుగుడు వేశాను.

- గొర్లి దేముడుబాబు, లగిశెట్టిపాలెం, సబ్బవరం

చిన్నారులకు ఉచితంగా గుండె శస్త్ర చికిత్సలు

- రాష్ట్రీయ బాలస్వాస్థ్య ప్రోగ్రామ్‌లో భాగంగా నిర్వహించనున్న ప్రభుత్వం
- ఇప్పటివరకూ తిరుపతిలో మాత్రమే ఈ తరహా ఆపరేషన్లు నిర్వహణ
- ఇప్పుడు ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాల కోసం విశాఖలోని మెడికవర్ ఆస్పత్రి ఎంపిక
- వెయ్యి మందిలో ఎనిమిది మంది శిశువులకు గుండె సమస్యలు
- జన్యుపరమైన కారణాలు, పోషకాహారలోపం కారణాలు

విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గుండె జబ్బులతో పుట్టిన చిన్నారులకు ఉచితంగా శస్త్రచికిత్సలను నిర్వహించేందుకు ప్రభుత్వం ముందుకువచ్చింది. ప్రస్తుతం తిరుపతిలోని పద్మావతి ఆస్పత్రిలో ఈ తరహా శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు. అయితే, ఉత్తరాంధ్రలో కూడా ఇటువంటి శస్త్రచికిత్సలను నిర్వహించాలని నిర్ణయించి, నగర పరిధిలోని మెడికవర్ ఆస్పత్రిని ఎంపిక చేసింది. ఉత్తరాంధ్రతోపాటు ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ (డీఈఐసీ) సెంటర్ల ద్వారా గుర్తించిన చిన్నారులకు ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు నిర్వహించనున్నారు. ఇందుకోసం రూపాయి కూడా బాధిత చిన్నారుల కుటుంబ సభ్యులు చెల్లించాల్సిన అవసరం లేదు. ఎన్‌టీఆర్ వైద్యసేవ కార్డు ఉంటే ఆ స్కీమ్‌లో, ఒకవేళ కార్డు లేకపోయినా ప్రత్యేక అనుమతి ద్వారా పిల్లలకు ఈ శస్త్రచికిత్సలు నిర్వహిస్తారు. నెల రోజులు కిందటే ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయాన్ని తీసుకున్నట్టు ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు.

వేయి మందిలో నలుగురికి..

సాధారణంగా వేయి మందిలో ఎనిమిది మంది నవజాత శిశువులు గుండె జబ్బులతో పుడుతున్నట్టు వైద్యులు పేర్కొంటున్నారు. వారిలో నలుగురికి శస్త్ర చికిత్సలు నిర్వహించాల్సిన అవసరం ఏర్పడుతోంది. గతంతో పోలిస్తే ఈ తరహా బాధిత చిన్నారులు పెరుగుతున్నట్టు చెబుతున్నారు. సాధారణ ప్రసవాల్లో వేయి మందిలో 8 మందికి గుండె జబ్బు ఉంటే, ఐవీఎఫ్, ఇతర పద్ధతుల్లో పుట్టే చిన్నారుల్లో 15 నుంచి 20 మందికి గుండె సమస్యలు ఉంటున్నట్టు పేర్కొంటున్నారు. గుండె శస్త్రచికిత్సల నిర్వహణకు కార్పొరేటు ఆస్పత్రుల్లో అయితే కనీసం రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఖర్చవుతుంది. అంత ఖర్చు చేసే స్థోమత సాధారణ, మధ్య తరగతి కుటుంబాలకు ఉండదు. అటువంటి వారికి అండగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహణకు నిర్ణయించింది.

ప్రాథమిక దశలో గుర్తించేందుకు స్ర్కీనింగ్

- డాక్టర్ బి.హారిక, ఆర్‌బీఎస్‌కే జిల్లా కో-ఆర్డినేటర్

చిన్నారుల్లో ఉన్న అనారోగ్య సమస్యలను గుర్తించేందుకు ఏడాదికి రెండుసార్లు హెల్త్ స్ర్కీనింగ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆశ, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ వెళ్లి స్ర్కీనింగ్ చేస్తారు. ఎత్తు, బరువు, హెచ్‌బీతోపాటు ఇతర పరీక్షలు నిర్వహిస్తారు. సమస్య ఉన్నట్టు గుర్తించిన వారిని స్థానిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి మరిన్ని పరీక్షలు చేస్తారు. అక్కడ ఏదైనా సమస్య ఉంటే జిల్లాస్థాయిలో ఉన్న డీఈఐసీకి రిఫర్ చేస్తారు. అక్కడ మరిన్ని పరీక్షలు నిర్వహించి తీవ్రమైన సమస్య ఉన్న వారికి శస్త్ర చికిత్సలు చేయిస్తాం. ఇప్పటివరకు గుండె జబ్బులు ఉన్న చిన్నారులను తిరుపతి పంపించి శస్త్ర చికిత్సలు చేయిస్తున్నాం. ఇకపై ఇక్కడే నిర్వహించేలా ప్రభుత్వం ఒక ప్రైవేటు ఆస్పత్రిని ఎంపిక చేసింది. ప్రస్తుతం నెలకు ఒకటి, రెండు కేసులు తిరుపతికి పంపిస్తున్నాం. వారికి ఇక్కడే శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నాం. కొద్దిరోజుల్లో ఆస్పత్రితో కలిసి ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తాం.

5న దామోదరం సంజీవయ్య లా వర్సిటీ స్నాతకోత్సవం

విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం సంయుక్త స్నాతకోత్సవాన్ని (8, 9, 10, 11, 12వ స్నాతకోత్సవాలు) ఈ నెల ఐదో తేదీన నిర్వహించనున్నట్టు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు వెల్లడించారు. బుధవారం డాబాగార్డెన్స్‌లోని ఒక హోటల్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు బీచ్‌రోడ్డులోని నోవాటెల్ హోటల్‌లో సాత్నకోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.నరసింహ గౌరవ అతిథిగా, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మహేశ్వరి విశిష్ట అతిథిగా హాజరుకానున్నట్టు తెలిపారు. రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేష్ విశిష్ట అతిథిగా హాజరవుతారన్నారు. ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, డీఎస్ఎల్ఎన్‌యూ గౌరవ చాన్సలర్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ స్నాతకోత్సవానికి అధ్యక్షత వహిస్తారన్నారు.

5 కిలోమీటర్లు డోలీ మోత

... 5వ పేజీ తరువాయి

అధికమయ్యాయి. గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో ఆమె భర్త గంగునాయుడు గ్రామస్థుల సహాయంతో డోలీలో ఆస్పత్రికి తరలించాలని నిర్ణయించాడు. నేలపాలెం నుంచి లుంగుపర్తికి ఐదు కిలోమీటర్లు గెడ్డలు, కొండలు దాటుకుంటూ ఆస్పత్రికి తరలించారు. నేలపాలెం గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు జన్ని భీమన్నదొర, జర్ర నారాయణ, చంటి బాబు, తదితరులు కోరారు.

స్నేహానికి ప్రతీక బలి ఉత్సవం

మాడగడలో బ్రిటీష్ కాలం నుంచి కొనసాగుతున్న ఆచారం

- వరుసగా మూడేళ్లు పండుగ చేస్తే ఆ తరువాత మూడేళ్లు బ్రేక్
- 12 రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ వేడుక ఈ నెల 5తో ముగింపు
- ఆఖరి రోజున హాజరుకానున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- తరతరాలు స్నేహం కొనసాగాలనుకునే వారు పాల్గొనే అరుదైన పండుగ



మాడగడలో బలి ఉత్సవం సందర్భంగా మహిళా పూజారుల సమక్షంలో 12 మంది అక్కాచెల్లెళ్లతో పూజలు చేయిస్తున్న దృశ్యం

అరకులోయ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని మాడగడ గ్రామంలో గిరిజనులు నిర్వహించే అరుదైన పండుగ గత నెల 25న ప్రారంభమైంది. బలి ఉత్సవంగా పిలిచే ఈ పండుగ 12 రోజుల పాటు నిర్వహిస్తారు. గిరిజనుల ఆహ్వానం మేరకు ఆఖరి రోజైన ఈ నెల 5వ తేదీన జరిగే వేడుకకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హాజరుకానున్నారు. దీంతో ఈ పండుగపై అందరిలో ఆసక్తి పెరిగింది. ఈ పండుగ విశిష్టతను తెలుసుకోవాలనే ఉత్సాహం అందరిలో నెలకొంది. స్నేహానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగ బ్రిటీష్ కాలంలో ఈ గ్రామంలో మొదలైంది.

బలి ఉత్సవం ప్రాముఖ్యత

మాడగడ ముఠా పరిధిలో ఉన్న ప్రజలంతా పాడి పంటలు, పశుసంపద, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటూ ప్రత్యేకంగా పూజలు చేస్తారు. అంతేకాకుండా ఎవరితోనైనా స్నేహం కోరుకునేవారు చివరి రోజున జరిగే కార్యక్రమంలో బలిపుష్పాలను ఒకరి చెవిలో మరొకరు పెట్టి స్నేహం కోరుకుంటారు. అప్పటి నుంచి వారు శాశ్వతంగా స్నేహితులుగా గుర్తింపు పొందుతారు.



గోధుమలు నాటే క్రమంలో పవిత్ర గెడ్డ నుంచి ఇసుకను సేకరించేందుకు పూజలు చేస్తున్న దృశ్యం

బ్రిటీష్ కాలంలో ముఠాదారు వ్యవస్థ మొదలైంది. మండలంలోని సుంకరమెట్ట, కొత్తభల్లుగుడ, మాడగడ పంచాయితీలను కలుపుతూ మాడగడ ముఠాగా పిలిచేవారు. ఆ కాలంలో మాడగడ గ్రామంలో బలి ఉత్సవం(బలి పరోబ్) నిర్వహించేవారు. ఈ ఉత్సవాన్ని వరుసగా మూడేళ్లు నిర్వహిస్తే, ఆ తరువాత మూడేళ్లు నిర్వహించరు. 12 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవం ఈ ఏడాది ఆగస్టు 25న మొదలై ఈ నెల 5న ముగుస్తుంది. ఈ పండుగ విశేషాలు తెలుసుకున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గిరిజనులకు ట్విట్టర్ ద్వారా శుభాకాంక్షలు తెలియజేయడంతో అందరిలో ఆసక్తి నెలకొంది.

బలి ఉత్సవం ఇలా..

మొదటిరోజు ఊర్లో ఒక ఇంటి వద్ద రాట నిలబెట్టి అక్కడ పూజలు ప్రారంభిస్తారు. ఈ పూజలను మహిళా పూజారులే(ఒరియాలో వీరిని గుర్మాయినులు అంటారు) నిర్వహిస్తారు. మేళతాళాలతో 12 తెగలకు చెందిన 12 మంది అక్కాచెల్లెళ్లు (అన్నదమ్ముల భార్యలు)ఊరికి సమీపంలో ఉన్న పవిత్ర గెడ్డగా భావించే గెడ్డ వద్దకు వెళ్లి కొంత ఇసుకను సేకరించి తీసుకువస్తారు. ఒడిశా ప్రాంతం నుంచి గ్రామంలో ఉన్న బారికి (తలయారీ) గోధుమ విత్తనాలను సేకరించి తన ఇంటి వద్ద ఉంచుతారు. ఆ విత్తనాల కోసం వచ్చిన 12 మంది అక్కాచెల్లెళ్లకు బారికి నూతన వస్త్రాలు బహూకరించి, వారి కాళ్లకు మొక్కి సేకరించిన గోధుమ విత్తనాలను అందజేస్తాడు. ఆ అక్కాచెల్లెళ్లు ఆ విత్తనాలను పొలంలో నాటుతారు. విత్తనాలు మొలకెత్తిన సమయంలో గ్రామంలో ఉన్న మగ పూజారిపై వారు దైవంగా భావించే భీమదేవుడు ఆవహిస్తాడు. భీమదేవుడు ఆవహించిన పూజారికి గ్రామస్థులు పండ్లు, కాయలు, నైవేద్యం సమర్పిస్తారు. చివరి రోజున మొలకెత్తిన విత్తనాలను పొలంలో విడిచిపెడతారు. అంతకు ముందు పవిత్ర గెడ్డ వద్ద స్నేహాన్ని కోరుకునే వారికి 12 మంది అక్కాచెల్లెళ్లు బలిపుష్పాలను(మొలకెత్తిన విత్తనాలు) అందిస్తారు. వీటిని ఒకరి చెవిలో మరొకరు పెట్టి నాటి నుంచి స్నేహితులుగా గుర్తింపు పొందుతారు. అనంతరం వాటిని పవిత్ర గెడ్డలో విడిచిపెడతారు. ఇలా సంప్రదాయబద్ధంగా స్నేహాన్ని కోరుకునేవారు తరతరాలు ఈ స్నేహభావాన్ని కొనసాగించాల్సి ఉంటుంది.



గెడ్డ నుంచి ఇసుక సేకరించి వస్తున్న దృశ్యం

బరిస్టా కాఫీ తయారీ శిక్షణ పోస్టర్ ఆవిష్కరణ

- అరకులోయలో 23 నుంచి 27 వరకు శిక్షణ

పాడేరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): గిరిజన యువతకు బరిస్టా కాఫీ తయారీ శిక్షణకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్, ఎస్పీ అమిత్‌బర్ధార్ కలెక్టరేట్‌లో బుధవారం ఆవిష్కరించారు. సీఎం చంద్రబాబునాయుడు సూచనల మేరకు గిరిజన యువతకు ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు బరిస్టా కాఫీ తయారీపై స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ నిర్వహిస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ శిక్షణను గిరి యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి పి.రోహిణి, టీడబ్ల్యూ డీడీ పీకే.పరిమిళ, తదితరులు పాల్గొన్నారు.



కాఫీ తయారీ శిక్షణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, ఎస్పీ అమిత్‌బర్ధార్

టీడబ్ల్యూ డీడీగా పరిమిళ బాధ్యతల స్వీకరణ

పాడేరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పీకే పరిమిళ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గత పది నెలలుగా స్థానిక టీడబ్ల్యూ డీడీ పోస్టు ఖాళీగా ఉన్న నేపథ్యంలో నెల్లూరి జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖాధికారి(డీటీడబ్ల్యూవో)గా పని చేస్తున్న పీకే పరిమిళకు డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించి ఇక్కడ నియమించిన సంగతి తెలిసిందే. దీంతో ఆమె బుధవారం ఇక్కడికి వచ్చి టీడబ్ల్యూ డీడీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సూపరింటెండెంట్ భగీరథి, సిబ్బంది, ఏటీడబ్ల్యూవోలు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. గిరిజన సంక్షేమ శాఖ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు కంబిడి నీలకంఠం, ఎం.శోభన్‌బాబు, ఉపాధ్యక్షుడు పి.ఉపేంద్ర, కోశాధికారి ఎస్.సత్యనారాయణ, తదితరులు ఆమెను కలిసి అభినందనలు తెలిపారు. అందరి సహకారంతో గిరిజన విద్యాభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా నూతన టీడబ్ల్యూ డీడీ పరిమిళ పేర్కొన్నారు.



టీడబ్ల్యూ డీడీ పరిమిళకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కార్యాలయ సిబ్బంది

డిప్యూటీ సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

... 5వ పేజీ తరువాయి

నిర్వహించనున్న స్థలాన్ని ఎస్పీ పరిశీలించారు. డిప్యూటీ సీఎం పర్యటనపై అధికారిక ప్రకటన వెలువడిన వెంటనే ఆ వివరాలను మీడియాకు వెల్లడిస్తామని ఆయన తెలిపారు. అనంతరం జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ పీవో డాక్టర్ అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ మాడగడ గ్రామాన్ని సందర్శించారు. ముగింపు రోజున జరిగే పూజల గురించి గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. అధికారులకు పలు సూచనలు చేశారు.

అనంతగిరి ఘాట్‌లో భారీ వాహనాల రాకపోకలు నిషేధం

పాడేరు: ఈ నెల 3 నుంచి 6వ తేదీ వరకు అనంతగిరి ఘాట్ మార్గంలో భారీ వాహనాల రాకపోకలను నిషేధిస్తున్నట్టు ఎస్పీ అమిత్‌బర్ధార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ నెల 5న అరకులోయ మండలం మాడగడ రాక నేపథ్యంలో ఘాట్‌లో రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలనే ఈ ఆంక్షలు విధిస్తున్నారు. ఈ విషయాన్ని వాహనదారులు గుర్తించాలని, కేవలం భారీ వాహనాల రాకపోకలను మాత్రమే నిషేధించామని, ఇతర వాహనాలు యథాతథంగా తిరగవచ్చునని ఎస్పీ పేర్కొన్నారు. అలాగే డిప్యూటీ సీఎం అరకులోయ పర్యటన నేపథ్యంలో ప్రజలు పోలీసు యంత్రాంగానికి సంపూర్ణంగా సహకరించాలని ఎస్పీ కోరారు.



మాడగడకు వెళ్లే రహదారిలో గ్రామ పెద్దలతో మాట్లాడుతున్న ఎస్పీ అమిత్‌బర్ధార్. చిత్రంలో ఏఎస్పీ, డీఎస్పీ ఉన్నారు

సీఎం చంద్రబాబు విశాఖ రాక రేపు

... 5వ పేజీ తరువాయి

మీడియేషన్ సదస్సుకు ఆయన హాజరుకానున్నారు. ముఖ్యమంత్రి శుక్రవారం ఉదయం 7.30 గంటలకు ఉండవల్లి నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 8.50 గంటలకు రుషికొండ వద్ద గల హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి తొమ్మిది గంటలకు రాడిసన్ బ్లూ హోటల్‌కు వెళతారు. ఉదయం పది నుంచి 11.30 గంటల వరకూ సదస్సులో పాల్గొంటారు. అనంతరం 11.30 గంటలకు హోటల్ నుంచి తిరిగి రుషికొండ హెలిప్యాడ్‌కు చేరుకుని 11.40 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి ఉండవల్లి వెళతారని అధికార వర్గాలు తెలిపాయి. ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సెంటర్, కామన్వెల్త్ లాయర్స్ అసోసియేషన్ ఈ సదస్సు నిర్వహిస్తున్నాయి. సదస్సుకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ పీఎస్ నరసింహం, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీఎస్ ఠాకూర్, ఇతర న్యాయమూర్తులు హాజరవుతారు.

పాడేరు ఐటీడీఏ పీవోగా శ్రీపూజ నియామకం

... 5వ పేజీ తరువాయి

బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలో పోస్టింగ్ కోసం వేచి ఉన్న తిరుమణి శ్రీపూజను ఐటీడీఏ పీవోగా నియమించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం దొంగపండి గ్రామానికి చెందిన శ్రీపూజ కర్ణాటకలో బీటెక్ చేశారు. సివిల్స్‌పై ఆసక్తితో యూపీఎస్‌సీవైపు అడుగులు వేసి తొలి ప్రయత్నంలో విఫలం కాగా, రెండో ప్రయత్నంలో ఆలిండియాలో 62వ ర్యాంకు సాధించారు.

రంపచోడవరం ఐటీడీఏ పీవోగా బి.సమరన్‌రాజ్

జిల్లాలోని రంపచోడవరం ఐటీడీఏ పీవోగా 2022 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన బి.సమరన్‌రాజ్‌ను నియమించారు. ఇప్పటి వరకు పీవోగా పని చేస్తున్న కె.సింహాచలానికి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. అలాగే రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా పని చేసి ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్న కేఆర్ కల్పశ్రీని భూపరిపాలన శాఖలో జాయింట్ సెక్రటరీగా నియమించారు.

క్రైం... crime news

వెనుక నుంచి బస్సు ఢీకొని ఒకరి మృతి

బుచ్చెయ్యపేట, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ కె.శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా వున్నాయి. మండలంలోని కేపీ అగ్రహారం గ్రామానికి చెందిన జొన్నపల్లి ఈశ్వరరావు (55) సొంత పనిమీద బుధవారం ఉదయం ద్విచక్ర వాహనంపై బుచ్చెయ్యపేట వచ్చారు. బైక్‌ను పార్క్ చేసి, జెరాక్స్ సెంటర్ వద్దకు మెయిన్‌లో రోడ్డులో నడుచుకుంటూ వెళుతున్నారు. ఇదే సమయంలో ఒక ప్రైవేటు విద్యా సంస్థకు చెందిన బస్సు రివర్స్ తీసుకుంటూ ఈశ్వరరావును వెనుక నుంచి ఢీకొన్నది. దీంతో ఆయన బస్సు వెనుక చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతిచెందారు. ఇతనికి భార్య లక్ష్మి, దివ్యాంగుడైన కుమారుడు వున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యులు వచ్చిన తరువాత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.



జొన్నపల్లి ఈశ్వరరావు (ఫైల్ ఫొటో)

కాలుజారి చెరువులో పడి వ్యక్తి మృతి

చోడవరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోటవీధికి చెందిన జొన్నాడ శ్రీనివాసరావు (55) ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని పాతచెరువులో శవమై తేలాడు. ఇతను మంగళవారం బహిర్భూమి కోసం చెరువు వద్దకు వెళ్లి, ప్రమాదవశాత్తూ కాలుజారి నీటిలో మునిగి చనిపోయినట్టు స్థానికులు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు పాతచెరువు వద్దకు వెళ్లి పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



జొన్నాడ శ్రీనివాసరావు (ఫైల్ ఫొటో)

పాడేరు ఘాట్‌లో స్తంభించిన ట్రాఫిక్

... 5వ పేజీ తరువాయి

ఎదురవుతుండడంతో ఆర్టీసీ బస్సు డ్రైవర్లు, ప్రయాణికులు, పర్యాటకులు.. భారీ వాహనాలు కనిపిస్తే బెంబేలెత్తిపోతున్నారు. పాడేరు నుంచి మైదాన ప్రాంతానికి రాకపోకలు సాగించాలంటే ఘాట్ ప్రయాణం తప్పనిసరి. పాడేరు మండలం మినుములూరు నుంచి వి.మాడుగుల మండలం గరికబంద వరకు 25 కిలోమీటర్లు ఘాట్ మార్గమే. ఏజెన్సీలో పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు, డుంబ్రిగుడ మండలాలతో పాటు ఒడిశా రాష్ట్రానికి చెందిన వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తాయి. ఈ క్రమంలో ఘాట్‌లో ఎటువంటి అంతరాయం ఏర్పడినా మొత్తం రాకపోకలు నిలిచిపోవాల్సిన దుస్థితి నెలకొంటుంది. ప్రధానంగా రాత్రి వేళల్లో ఇటువంటి ఘటనలు జరిగితే ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

కలెక్టర్‌కూ తప్పని అవస్థలు

ఘాట్‌లోని ఏసుప్రభు బొమ్మ మలుపు వద్ద ట్రాఫిక్ స్తంభించడంతో విశాఖపట్నం నుంచి పాడేరు వస్తున్న కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ అక్కడే ఆగిపోవాల్సి వచ్చింది. దీంతో వెంటనే పాడేరు నుంచి మరో వాహనాన్ని రప్పించుకుని కలెక్టర్ అక్కడి నుంచి గమ్యానికి చేరుకున్నారు. అయితే సుమారుగా మూడు గంటల తరువాత రోడ్డుకు అడ్డంగా ఉన్న లారీలను పక్కకు తీయడంతో రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. మోటారు చట్టాల నిబంధనలకు విరుద్ధంగా ఓవర్ లోడ్‌తో ఘాట్‌లో రాకపోకలు సాగించే క్రమంలో ఈ సమస్య ఎదురవుతోంది. దీనిపై రవాణా, పోలీసు అధికారులు కనీసం దృష్టిసారించకపోవడంతో వారంలో కనీసం రెండు, మూడు మార్లు ఇటువంటి ఇబ్బందులు తప్పడం లేదని బస్సు డ్రైవర్లు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చింతపల్లిలో కాఫీ బెర్రీ బోరర్ తెగులు

... 5వ పేజీ తరువాయి

కేవలం రెండు వందల మీటర్ల దూరంలో ఉద్యాన పరిశోధన స్థానం కాఫీ తోటలు ఉన్నాయన్నారు. ఈ ఏడాది అరకులోయ ప్రాంతం నుంచి కాఫీ గింజలను చింతపల్లి కాఫీ ఎకో పల్పింగ్ కేంద్రానికి తీసుకొచ్చి పల్పింగ్ చేయడం, ఎండబెట్టడం వల్ల ఈ తెగులు సమీపంలో ఉన్న ఉద్యాన పరిశోధన స్థానం కాఫీ తోటలకు వ్యాప్తి చెంది వుంటుందని ప్రాథమికంగా గుర్తించామన్నారు. ఈ తెగులును కలిగించే ఆడ బోరర్(కీటకం) 500 మీటర్ల వరకు ఎగురుతుందని, మగ బోరర్ ఇతర ప్రాంతాలకు వ్యాప్తి చెందన్నారు. ఎకో పల్పింగ్ యూనిట్‌కి అతి సమీపంలో ఉద్యాన పరిశోధన స్థానం కాఫీ తోటలు ఉండడం వల్లనే ఈ తెగులు వ్యాప్తి చెంది వుంటుందన్నారు. ఎకో పల్పింగ్ యూనిట్ పది కిలోమీటర్ల లోపు కాఫీ తోటలను పరిశీలించగా, ఎక్కడా ఈ తెగులు కనిపించలేదన్నారు. అరకులోయ, చింతపల్లి ఉద్యాన పరిశోధన స్థానంలో మినహా ఎక్కడా ఈ తెగులు ఇంత వరకు బయటపడలేదన్నారు. ఉద్యాన పరిశోధన స్థానంలో ఈ తెగులు నియంత్రణకు ప్రాథమికంగా సిరమోన్ ట్రాప్‌లు ఏర్పాటు చేశామన్నారు. కాఫీ బెర్రీ బోరర్ తెగులు తొలిదశలోనే నాశనం చేసేందుకు చర్యలు ప్రారంభించామని, తెగులు నియంత్రణకు చేపట్టాల్సిన నివారణ చర్యలను ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలకు తెలియజేశామన్నారు. ఉద్యాన పరిశోధన స్థానం అధిపతి, శాస్త్రవేత్త బిందు మాట్లాడుతూ పరిశోధన స్థానం కాఫీ తోటలో కాఫీ బెర్రీ బోరర్ తెగులు నియంత్రణ చర్యలను యుద్ధప్రాతిపదికన ప్రారంభించామన్నారు. ఈ తెగులు వ్యాప్తి చెందిన తోటలను క్వారంటైన్ చేశామని చెప్పారు.

జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

... 5వ పేజీ తరువాయి

నిర్వహించాలన్నారు. ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య సేవలు క్షేత్ర స్థాయిలో సక్రమంగా అందాలని, బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. గర్భిణుల నమోదు, బాలింతలు, చిన్నారులకు అవసరమైన వైద్య సేవలు, పోషకాహారం అందించాలని చెప్పారు. విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన సదరం సర్టిఫికెట్లను సకాలంలో అందించాలన్నారు. ఇతర శాఖలకు చెందిన ప్రగతిపైనా కలెక్టర్ ఆరా తీసి, పనులు వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎంజే అభిషేక్‌గౌడ, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పీవోలు సింహాచలం, అపూర్వభరత్, సబ్‌కలెక్టర్ శుభం నఖ్వాల్, సమగ్ర శిక్ష ఏపీసీ స్వామినాయుడు, డీఈవో బ్రహ్మాజీరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ టి.విశ్వేశ్వరనాయుడు, ఐసీడీఎస్ పీడీ ఝాన్సీబాయి, విభిన్నప్రతిభావంతుల శాఖ ఏడీ కె.కవిత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఉత్తమ టీచర్లుగా ముగ్గురు ఎంపిక

... 5వ పేజీ తరువాయి

రాంబాబు, హుకుంపేట మండలం మత్స్యపురంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో టీచర్ ఎం.సత్యారావు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఈ నెల 5న అమరావతిలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవంలో ఈ ముగ్గురు ఉపాధ్యాయులు సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అవార్డులను అందుకోనున్నారు. గిరిజన ప్రాంతానికి చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు రాష్ట్ర స్థాయి అవార్డులకు ఎంపిక కావడంపై పలువురు ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	121.00
లైవ్ ధర	141.00
విత్ స్కిన్	252.00
స్కిన్ లెస్	262.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579